క్లుప్తంగా

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు



విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: స్థానిక తొగటవీర కల్యాణ మండపంలో తొగటవీర క్షత్రీయ సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం టెన్త్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. సంఘం సభ్యుడు బండారు ఆదినారాయణ మాట్లాడుతూ టెన్త్‌లో 540కు పైగా మార్కులు వచ్చిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందించామన్నారు.

నేడు 'ప్రజా వేదిక'

బత్తలపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సామాజిక తనిఖీపై ప్రజావేదిక(బహిరంగ సభ) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏపీఓ ఆదెప్ప తెలిపారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు 'కాకతీయ' విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు పాఠశాల విద్యార్థి భాను ఎంపికైనట్లు కాకతీయ విద్యానికేతన్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ నిర్మలాదేవి, డైరెక్టర్లు శెట్టిపి సూర్యప్రకాష్‌రెడ్డి, శెట్టిపి పద్మ తెలిపారు. స్థానిక కాకతీయ పాఠశాలలో గురువారం విద్యార్థిని అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 10 నుంచి 11 వరకు చిత్తూరు జిల్లా వి.కోటలో జరిగే రాష్ట్రస్థాయి 7వ ఇంటర్ డిస్ట్రిక్ట్ షూటింగ్ బాల్ చాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొనే జిల్లా జట్టులో కాకతీయ విద్యార్థి భాను ఎంపికయ్యాడన్నారు.

ఆర్టీసీ సర్వీసుల ఏర్పాటు

కదిరి అర్బన్: శ్రావణమాసాన్ని పురస్కరించుకుని ప్రతి శనివారం కదిరి నుంచి నల్లచెరువు మండలం పాలపాటిదిన్నె ఆంజనేయ స్వామి ఆలయానికి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేసినట్లు డీఎం మైనోద్దీన్ గురువారం తెలిపారు. ములకలచెరువు నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని, భక్తులు అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

విజేతలకు అభినందనలు



విజేతలతో ఉపాధ్యాయులు

బత్తలపల్లి: ఆర్డీటీ క్రీడా మైదానంలో బుధవారం జరిగిన బాలికల రూరల్ అథ్లెటిక్స్ మీట్‌లో జిల్లా పరిషత్ పాఠశాల రామాపురం విద్యార్థినులు 8 మెడల్స్ సాధించినట్లు పాఠశాల హెచ్‌ఎం వెంకటనాయుడు, పీడీ లక్ష్మీనారాయణ తెలిపారు. గురువారం స్థానిక పాఠశాలలో విజేతలకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అండర్-16 విభాగం కాంచన లాంగ్‌జంప్‌లో మొదటి స్థానం, శిరీష షాట్‌పుట్‌లో మొదటి స్థానం, చందన 100 మీటర్స్ పరుగు పందెంలో 2వ స్థానం, పవిత్ర 200 మీటర్స్ పరుగు పందెంలో 2వ స్థానం, చరిత షాట్‌పుట్‌లో 3వ స్థానం సాధించారన్నారు. అండర్-14 విభాగంలో జస్విత లాంగ్‌జంప్ మొదటి స్థానం, భువనేశ్వరి షాట్‌పుట్‌లో 2వ స్థానం, చరిత షాట్‌పుట్‌లో 3వ స్థానం సాధించినట్లు తెలిపారు. విజేతలను స్కూల్ కమిటీ చైర్మన్ రాజకుళ్లాయప్ప అభినందించారు.

ఆవాజ్ మండల కమిటీ ఎన్నిక

ముదిగుబ్బ: మండల కేంద్రంలో గురువారం సీఐటీయూ నేత ఆటో పెద్దన్న అధ్యక్షతన ఆవాజ్ మండల కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఆవాజ్ కమిటీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఎం.ఇంతియాజ్, కదిరి సీఐటీయూ నేత నరసింహులు హాజరయ్యారు. మండల గౌరవాధ్యక్షుడిగా పక్కృద్దీన్, ప్రధాన కార్యదర్శిగా బాజ్జాన్, అధ్యక్షుడిగా మహమ్మద్ రఫీ, కోశాధికారిగా నౌసాద్, కార్యవర్గ సభ్యులుగా 16 మందిని ఎన్నుకున్నారు.

సూపరింటెండెంట్ బాధ్యతల స్వీకరణ



సూపరింటెండెంట్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కలెక్టరేట్ సిబ్బంది

పుట్టపర్తి అర్బన్: స్థానిక కలెక్టర్ కార్యాలయంలో కలెక్టరేట్ సూపరింటెండెంట్-1గా సాకే నాగరాజు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా ఆయనకు ఎన్నికల అధికారి మైనుద్దీన్, యశ్వంత్ తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

మూగజీవాలకు సీజనల్ వ్యాధుల ముప్పు

- నీలినాలుక, థైలేరియాసిస్, గాలికుంటు వ్యాధులపై అప్రమత్తత అవసరం
- సకాలంలో గుర్తించి టీకాలు వేయించకుంటే తీవ్ర నష్టం
- సూచనలు పాటించాలంటున్న పశువైద్యాధికారులు



గొర్రెలకు టీకాలు వేస్తున్న వెటర్నరీ సిబ్బంది

ఎన్పీకుంట: వర్షాకాలంలో మూగజీవాలకు సీజనల్ వ్యాధులు ఎక్కువగా వచ్చే అవకాశాలు ఉన్నాయి. సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే పెంపకందారులు నష్టపోవాల్సి వస్తుందని పశువైద్యాధికారులు హెచ్చరిస్తున్నారు. మండలంలో 1,32,813 గొర్రెలు, 34,471 మేకలు, 10,250 ఆవులు, 2000 గేదెలు ఉన్నాయి. ప్రస్తుతం వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడంతో మూగజీవాలకు సీజనల్ వ్యాధుల ముప్పు పొంచి ఉందని పశువైద్యాధికారి డాక్టర్ బాలానాయక్ చెబుతున్నారు. వివరాలు ఆయన మాటల్లోనే... వర్షాల కారణంగా మూగజీవాల్లో ముఖ్యంగా నీలి నాలుక, థైలేరియాసిస్, గాలికుంటు వ్యాధులు వ్యాపించే అవకాశం ఉంది. సకాలంలో వ్యాధులను గుర్తించకపోతే పెంపకందార్లు తీవ్రంగా నష్టపోవాల్సిందే.

నీలినాలుక వ్యాధి

గొర్రెల్లో నీలినాలుక వ్యాధి చాలా ప్రమాదకరమైనది. ఇది వైరస్ వ్యాధి. క్యూలికాయిడ్స్ అనే దోమతో ఒక గొర్రె నుంచి మరో గొర్రెకు వ్యాపిస్తుంది. వర్షాకాలంలో దోమల తీవ్రత ఎక్కువగా ఉండటం వలన వ్యాధి తీవ్రత కూడా ఎక్కువగా ఉండి గొర్రెలు చనిపోయే ప్రమాదం ఉంది. 105 నుంచి 106 డిగ్రీల జ్వరం ఉండి నోటిలో పుండ్లు ఏర్పడి చొంగ కారుతుంది. నోరు మొత్తం ఎర్రగా మారుతుంది. చొంగ నురగలా మారి పెదవులు, చిగుళ్లు, నాలుక వాచిపోతాయి. నాలుక చివరలో నీలిరంగు వస్తుంది. కాళ్ల గిట్టల చుట్టూ వాచి పుండ్లు ఏర్పడతాయి. ఆహారం తీసుకోక పోవడంతో ఆరోగ్యం క్షీణించి వారం రోజుల్లో మృత్యువాత పడతాయి.

నివారణ:

వ్యాధి సోకిన గొర్రెలను సకాలంలో గుర్తించి పశువైద్యులతో చికిత్స చేయించాలి. నోటిపుండ్లను ఒక శాతం బోరిక్‌యాసిడ్ లోషన్‌తో శుభ్రం చేయాలి. గొర్రెలు ఆకలితో చనిపోకుండా ఉండేందుకు జావ లాంటివి తాపించాలి. గిట్టల చుట్టూ ఉన్న పుండ్లను కడిగి హిమాక్స్, నీమ్‌వెంట్ వంటి ఆయింట్‌మెంట్లు పూయాలి. యాంటీబయాటిక్ ఇంజెక్షన్లు ఇప్పించాలి. దోమల నివారణకు పరిసరాలను శుభ్రంగా ఉంచి వేప పొగ పెట్టాలి. వ్యాధినిరోధక శక్తి పెరిగేందుకు విటమిన్-సి ఇంజెక్షన్, పొడులను వాడాలి.

థైలేరియాసిస్

ఈ వ్యాధి ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలకు వస్తుంది. పరాన్నజీవికి చెందిన గోమార్లు, పిడుదుల వలన ఈ వ్యాధి సోకుతుంది. 6 నుంచి 12 నెలల వయసు ఉన్న పశువులు ఈ వ్యాధిబారిన పడతాయి. పరాన్నజీవులు మూగజీవాల రక్తకణాల్లో ఆవాసం ఏర్పరుచుకోవడంతో రక్తకణాలు పగిలి మృత్యువాత పడతాయి. ఈ వ్యాధి సోకిన పశువులలో మూత్రం కాఫీ, ఎరుపు రంగులో ఉంటుంది. తీవ్ర జ్వరం, ముక్కు నుంచి నురగ కారడం, శ్వాస తీసుకోవడం కష్టం అవుతుంది. తరచుగా దగ్గడంతో పాటు కళ్లు ఎర్రగా మారుతాయి. మేత తినవు, నెమరు వేయవు. రక్తం, బంక విరేచనాలు అవుతాయి. పాల ఉత్పత్తి తగ్గుతుంది.

నివారణ:

వ్యాధి సోకిన పశువులను మంద నుంచి వేరు చేయాలి. పశువుల కొట్టంలో పురుగుమందులు కొట్టాలి. పశువుల పాకలో మురుగు, తేమ లేకుండా చూసుకోవాలి. టెట్రాసైక్లిన్, ప్రోటోమిన్ మందులతో పాటు ఐరన్ ఇంజెక్షన్లు వాడాలి.

గాలికుంటు వ్యాధి

గాలికుంటు వ్యాధి ఆఫ్తోవైరస్ పికోర్న జాతికి చెందిన వైరస్ వలన వ్యాపిస్తుంది. ఈ వ్యాధి సోకిన పశువులలో పాల ఉత్పత్తి సగానికి తగ్గిపోతుంది. నోరు, గిట్టల మధ్య పుండ్లు ఏర్పడి పశువులు కుంటుతూ మేత మేయవు నెమరు వేయవు. 104 నుండి 106 డిగ్రీల జ్వరం వస్తుంది. నోటి నుంచి చొంగ కారుతుంది. ఆడ పశువులలో వంధత్వం ఏర్పడుతుంది. ఎద్దులలో పనిసామర్థ్యం తగ్గుతుంది. ఈ వ్యాధికి సరైన చికిత్స లేదు. వ్యాధి సోకకుండా గాలికుంటు నివారణ టీకాలు తప్పని సరిగా వేయించుకోవాలి.

క్రమం తప్పకుండా టీకాలు వేయించాలి



మూగజీవాల పెంపకందారులు సకాలంలో టీకాలు వేయించడం ద్వారా సీజనల్ వ్యాధుల నుంచి వాటిని రక్షించుకోవచ్చు. వర్షాకాలంలో అధికంగా వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. జీవాలను గమనిస్తూ ఏదైనా సమస్య ఉంటే పశువైద్యులను సంప్రదించాలి.

– డాక్టర్ బాలానాయక్, పశువైద్యాధికారి, ఎన్.పీ.కుంట

కొత్త క్రిమినల్ చట్టాలను నిలుపుదల చేయాలి



ఆర్డీఓకు వినతిపత్రం అందిస్తున్న ఆలిండియా లాయర్స్ యూనియన్ నాయకులు

ధర్మవరం అర్బన్: కేంద్ర ప్రభుత్వం మార్చిన కొత్త క్రిమినల్ చట్టాలను నిలుపుదల చేయాలని ఆలిండియా లాయర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఇడప బత్తిని ప్రసాద్, నాయకులు నరసింహమూర్తి, మోహన్, పెద్దన్న, సంధ్య కోరారు. ఈమేరకు స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో గురువారం ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డికి వినతిపత్రం అందించారు. కొత్త క్రిమినల్ చట్టాలను నిలుపుదల చేయాలని, కొత్త చట్టాలపై న్యాయవాదులు, ప్రజలు చర్చలు జరపాలన్నారు. కోర్టుల్లో ఖాళీ ఉన్న న్యాయమూర్తులు, ఉద్యోగుల భర్తీ చేయాలని కోరారు.

పాఠశాలకు మైక్‌సెట్ వితరణ



హెచ్‌ఎంకు మైక్‌సెట్ పరికరాలు అందిస్తున్న దాత ప్రసాద్‌రెడ్డి

నల్లమాడ: రెడ్డిపల్లి జెడ్పీ హైస్కూల్‌కు గురువారం బాపనకుంట గ్రామానికి చెందిన పాఠశాల పూర్వపు విద్యార్థి, ఎల్ఐసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఏ. ప్రసాద్‌రెడ్డి మైక్‌సెట్‌ను వితరణ చేశారు. ఆయన మాట్లాడుతూ తాను చదువుకున్న పాఠశాలకు సాయం అందించాలన్న ఉద్దేశంతో తన వదిన భారతి జ్ఞాపకార్థం రూ.15 వేలు విలువ చేసే యాంప్లిఫైర్, లౌడ్ స్పీకర్ అందజేశానన్నారు. హెచ్‌ఎం జంషీద్, కసుముక్కల లక్ష్మన్న తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు

కదిరి అర్బన్: కదిరి మున్సిపాల్టీ, రూరల్ మండల్లాలోని అన్ని 96 ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం పాఠశాల యాజమాన్య కమిటీ(ఎస్ఎంసీ) ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. కే. బ్రాహ్మణపల్లి జడ్పీ హైస్కూల్‌లో జరిగిన ఎన్నికలను కదిరి డివిజన్ అబ్జర్వర్ జాన్‌రెడ్డెప్ప తనిఖీ చేశారు. కదిరి జెడ్పీ బాలికోన్నత పాఠశాల యాజమాన్య కమిటీ చైర్‌పర్సన్‌గా సుజాత, వైస్ చైర్మన్‌గా పఠాన్‌నౌషాద్‌తో పాటు మరో 13 మంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఎంఈఓ చెన్నక్రిష్ణ హెచ్‌ఎం వెంకటాచలం విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గాండ్లపెంట: మండల వ్యాప్తంగా ఉన్న 59 ప్రభుత్వ పాఠశాలల్లో 2 మినహా అన్ని పాఠశాలల్లో గురువారం ఎస్ఎంసీ ఎన్నికలు సజావుగా జరిగాయి. ఎన్నికలను ఎంఈఓలు క్రిష్టానాయక్, శ్రీనివాసులు పర్యవేక్షించారు. గాండ్లపెంట ఉన్నత పాఠశాల కమిటీ చైర్మన్‌గా రెడ్డినాయక్‌ను ఎన్నుకున్నట్లు హెచ్‌ఎం సిద్దారెడ్డి తెలిపారు. ఇదిలా ఉండగా గాండ్లపెంట హైస్కూల్‌లో మధ్యాహ్నభోజన ఏజెన్సీని తొలగించడానికి తొలి తీర్మానం చేశారు. గత 22 ఏళ్లుగా ఏజెన్సీ నిర్వహిస్తున్న కట్టుబడి ఆసియాను మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వహణ నుంచి తప్పకోవాలని తీర్మానం చేయడంతో తొలగించామని ఎంఈఓ క్రిష్టానాయక్ ఫోన్ ద్వారా తెలిపారు. గత తెలుగుదేశం ప్రభుత్వ పాలనలో సైతం ఆసియా పని చేశారు. తమ కుటుంబ సభ్యులు వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులు కావడంతో తొలగించారని ఆసియా వాపోయింది.

తాడిమర్రి: మండలంలో 36 ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం ఎస్ఎంసీ ఎన్నికలను నిర్వహించారు. ఎంపీడీఓ మణిమంజరి, ఎంఈఓలు క్రిష్ణమోహన్, వెంకటేశులు ఎన్నికలను పర్యవేక్షించారు. పెద్దకోట్లలో నల్లపు వనిత చైర్‌పర్సన్‌గా, వైస్ చైర్మన్‌గా బ్రహ్మానందరెడ్డి ఎన్నికయ్యారు. ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి మాజీ సర్పంచ్ పాటిల్ ప్రకాష్‌రెడ్డి, సర్పంచ్ శ్రీరాములు, మురళీమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తనకల్లు: మండల వ్యాప్తంగా ఉన్న 83 ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం ఎస్ఎంసీ సభ్యులతో పాటు చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకున్నట్లు ఎంఈఓ లలితమ్మ తెలిపారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తలుపుల : మండలంలోని 68 ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. నూతనకల్వ, సంగటివారిపల్లి పాఠశాలల్లో అధికార పార్టీ ఒత్తిళ్లతో ఎన్నికలు వాయిదా పడినట్లు సమాచారం.

కొత్తచెరువు: మండల వ్యాప్తంగా ఉన్న 42 ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఎంఈఓ జయచంద్ర ఎన్నికలను పర్యవేక్షించారు.

అమడగూరు: మండల వ్యాప్తంగా 49 పాఠశాలల్లో గురువారం ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినట్లు ఎంఈఓ జిలాన్‌బాషా పేర్కొన్నారు. ఎన్నికైన కమిటీ సభ్యులు రెండేళ్ల పాటు పదవిలో ఉండనున్నట్లు ఆయన తెలిపారు.

ఎస్ఎంసీ చైర్మన్లుగా వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు

నల్లమాడ: గురువారం జరిగిన ఎస్ఎంసీ ఎన్నికల్లో పలుచోట్ల వైఎస్సార్ సీపీ సానుభూతిపరులు చైర్మన్, వైస్ చైర్మన్లుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గూడమేకలపల్లి ప్రాథమిక పాఠశాల చైర్మన్‌గా కాయల చలపతి, వైస్ చైర్మన్‌గా పల్లపు చంద్ర, సుబ్బరాయునిపల్లి ప్రాథమిక పాఠశాల చైర్మన్‌గా టీ. రమేష్, వైస్ చైర్మన్‌గా ఏ.యశోదమ్మ, దొన్నికోట జెడ్పీహైస్కూల్ వైస్ చైర్మన్‌గా సురేష్, అదే గ్రామంలోని ప్రాథమిక పాఠశాల వైస్ చైర్మన్‌గా చాంద్‌బాషా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఎన్పీకుంట: మండల వ్యాప్తంగా 58 ప్రభుత్వ పాఠశాలలకుగాను పెడబల్లి ప్రాథమికోన్నత పాఠశాల, ధనియానిచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మినహా ఎస్ఎంసీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. ఎన్నికైన కమిటీ రెండేళ్లపాటు ఉంటుందని ఎంఈఓ-2 సుబ్బిరెడ్డి తెలిపారు.

నల్లచెరువు: మండలంలోని 53 ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం ఎస్ఎంసీ ఎన్నికలు సజావుగా జరిగాయని ఎంఈఓ తిరుపాల్ నాయక్ తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు ఎస్ఎంసీ చైర్మన్లు, వైస్ చైర్మన్లను ఎన్నుకున్నారన్నారు.

కనగానపల్లి/చెన్నేకొత్తపల్లి: కనగానపల్లి మండలంలోని 47 ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఎంసీ (స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ) ఎన్నికలు పూర్తయినట్లు ఎంఈఓ అరుణమ్మ తెలిపారు. కమిటీ సభ్యుల నుంచే చైర్మన్, వైస్ చైర్మన్లను ఎంపిక చేసినట్లు స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. చెన్నేకొత్తపల్లిలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో జరిగిన ఎస్ఎంసీ ఎన్నికలను జిల్లా ఐఈడీ (ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ కో-ఆర్డినేటర్) ఆనందబాబు పరిశీలించారు. తొలుత పాఠశాల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఇందులో ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్ల జాబితాను పరిశీలించారు. అనంతరం కేజీబీవీ ప్రిన్సిపాల్ సువర్ణకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్సీ సిబ్బంది రామ సుబ్బారెడ్డి, శివారెడ్డి, శివయ్య తదితరులు పాల్గొన్నారు. మండలంలో మొత్తం 56 పాఠశాలలకు ఎన్నికలు జరిగాయని ఎంఈఓలు మున్వర్‌బాషా, ప్రసూన్‌కుమార్ నాయుడు తెలిపారు.

సేవాకేంద్రం ప్రారంభం

కదిరి అర్బన్: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో రిటైర్డ్ అసిస్టెంట్ డీఎం నూతనంగా ఏర్పాటు చేసిన ఉద్యోగుల ఇంటర్‌నెట్ సేవాకేంద్రాన్ని గురువారం ఆర్డీఓ సన్నీవంశీకృష్ణ ప్రారంభించారు. ఉద్యోగులు ఇంటర్‌నెట్ సేవలను వినియోగించుకోవాలని పలువురు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎం మైనోద్దీన్, ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి, అసిస్టెంట్ డీఎం హరిత పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శివ పార్వతుల విగ్రహ ప్రతిష్ట

తాడిమర్రి: నిడిగల్లు గ్రామంలో నాలుగు రోజులుగా జరుగుతున్న శివ పార్వతుల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం గురువారం ముగిసింది. వేద పండితులు ఆధ్వర్యంలో గురువారం తెల్లవారు జామున 4 గంటల నుంచి 5 గంటల వరకు విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ, పూర్ణాహుతి చేపట్టారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పార్వతి పరమేశ్వర కళ్యాణాన్ని వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం గ్రామ పెద్దల ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. స్థానికులతోపాటు నార్సింపల్లి, పుల్లంపల్లి, మేడిమాకులపల్లి తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

చేపల చెరువుల వేలం

పుట్టపర్తి టౌన్: స్థానిక కౌన్సిల్ సమావేశ మందిరంలో గురువారం కమిషనర్ అంజయ్య ఆధ్వర్యంలో చేపల చెరువుల వేలం వేశారు. బోయ శ్రీరాములు అనే వ్యక్తి సాహెబ్ చెరువును రూ.2 లక్షలు, ఎనుములపల్లి చెరువును రూ.1.40 లక్షలకు దక్కించుకున్నారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

కొత్తచెరువు: మండల వ్యాప్తంగా ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతులు ఈ-క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించకోవాలని ఏఓ నటరాజ్ సూచించారు. గురువారం ఆయన కొడపగానిపల్లిలో జరుగుతున్న ఈ-క్రాప్ బుకింగ్‌ను పరిశీలించారు.

గాండ్లపెంట తహసీల్దార్‌గా వేణుగోపాల్



గాండ్లపెంట: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నూతన తహసీల్దార్‌గా ఎం.వేణుగోపాల్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన రెవెన్యూ సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

ఇళ్ల కొలతల సేకరణ

తాడిమర్రి: మండల కేంద్రంలో గురువారం సచివాలయ సిబ్బంది ఇంటింటా కొలతలు సేకరించారు. గతంలో ప్రతి ఇంటికి నిర్దేశించిన మొత్తాన్ని వసూలు చేస్తుండగా ఇకపై ఇంటి గదుల విస్తీర్ణాన్ని బట్టి పన్నులు వసూలు చేయడానికి కొలతలు తీసుకుంటున్నట్లు సచివాలయ సిబ్బంది తెలిపారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ రవి, డిజిటల్ అసిస్టెంట్ మోహన్, వెల్ఫేర్ అసిస్టెంట్ మీనాకుమారి, మహిళా పోలీస్ జ్యోతిర్మయి తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిత

అమడగూరు: చదువుతోనే ఉజ్వల భవిత సాధ్యమని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్ పేర్కొన్నారు. గురువారం కళాశాలలో ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ముందుగా సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు జ్ఞాపికలను ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో అధ్యాపకులు మాట్లాడుతూ తల్లితండ్రుల ఆవేదనను అర్థం చేసుకుని విద్యార్థులు అంకుఠిత దీక్షతో చదువుకోవాలన్నారు. తర్వాత విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అధ్యాపకులు షానవాజ్, రఘునాథరెడ్డి, ఇందాదుల్లా, గంగన్న, సూర్యప్రకాష్, జయరాంనాయక్, ఎల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

తనకల్లు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని హెల్త్ సూపర్‌వైజర్ సూర్యనారాయణరెడ్డి ప్రజలకు సూచించారు. చీకటిమానిపల్లిలో గురువారం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇంట్లో, బయట నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు.

ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలని పేర్కొన్నారు. అనంతరం వీధుల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించారు. నీటి నిల్వలపై బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ మోహన్‌రెడ్డి, ఏఎన్‌ఎం సుస్మిత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళాన్ని అందిస్తున్న బయపరెడ్డి

బత్తలపల్లి: మండల కేంద్రంలో రజక అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న గంగమ్మతల్లి ఆలయ నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి గురువారం రూ.20 వేలు విరాళం అందజేశారు. రజక అభివృద్ధి కమిటీ సభ్యులు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నేతలు దాసరి సూరి, అక్కిం ముసలప్ప తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన అవసరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

చెన్నేకొత్తపల్లి: బాలల హక్కులు, చట్టాలు, బాల్య వివాహాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని బాలల సంరక్షణ సమితి కౌన్సిలర్ శివలత సూచించారు. గురువారం మండల పరిధిలోని కనుముక్కల ఉన్నత పాఠశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హక్కులు, చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అలాగే బాల్యవివాహాల వలన కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే పోలీసులు, ఐసీడీఎస్ అధికారులకు సమాచారం అందించాలన్నారు. బాల్య వివాహాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పార్వతి, సోషల్ వర్కర్ వనజాక్షి, ప్రసన్నలక్ష్మి, శ్రావణి, ఏఎన్‌ఎం సునీత, ఎంఎల్‌హెచ్‌పీ సౌందర్య, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అప్పరాచెరువులో పశు గర్భకోశ చికిత్స శిబిరం



పశువులకు పరీక్షలు నిర్వహిస్తున్న టీవీ సుధాకర్

బత్తలపల్లి: జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గురువారం అప్పరాచెరువు గ్రామంలో ఉచిత గర్భకోశ చికిత్సా శిబిరం నిర్వహించారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణ అధికారి, డీడీ డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ 90 శాతం కచ్చితత్వంతో పెయ్య దూడల పుట్టుకను ఉద్దేశించి లింగ నిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భధారణ పథకంపై అవగాహన కోసం శిబిరం నిర్వహించామన్నారు. రైతులు రూ.500 చెల్లిస్తే, ప్రభుత్వం సబ్సిడీ కింద రూ.850 చెల్లించి మొత్తం రూ.1,350 విలువ గల రెండు సూదులను సరఫరా చేస్తుందన్నారు. ఈ సూదులు వేసినా కట్టకపోతే రూ.500 వాపస్ ఇవ్వడం, పొరపాటున కుర్ర దూడ పుడితే రూ.250 వాపస్ ఇస్తామన్నారు. స్వదేశీ జాతులైన గిర్, సాహివాల్, థార్పర్కార్ వంటి కావలసిన బ్రీడ్‌లను ఎంపిక చేసుకునే అవకాశం ఉందన్నారు. పాడి పశువులలో మంచి కట్టు శాతం రావటానికి ఆఖరు దశలో ఉన్నప్పుడు కృత్రిమ గర్భధారణ చేయిస్తే మాత్రమే చూడి నిలుస్తుందన్నారు. సుబాబుల్ ఆకు వాడకం, ఈనిన మూడు నెలల్లోపే కృత్రిమ గర్భధారణ చేయించడం, ఎద సూది చేసిన తర్వాత 20 రోజుల పాటు బెల్లం నీళ్లు, టెంకాయ నీళ్ల లాంటివి తాపించాలన్నారు. అనంతరం సుమారు 31 పశువులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించారు. నట్టల నివారణ మందులు 40 వాటికి తాపారు. ధర్మవరం డీడీ చంద్రశేఖర్, టీవీ సుధాకర్, శ్రీనివాసులు, గుర్నాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నాగమ్మ తల్లి చల్లగా చూడమ్మా..



గొట్లూరులో నాగులకట్టకు పూజలు చేస్తున్న దృశ్యం

బత్తలపల్లి: నాగమ్మ తల్లి మీ బిడ్డలమైన మాపై నీ చల్లని చూపులతో దయ చూపాలని పలువురు మహిళలు గురువారం నాగులపుట్టలకు పూజలు నిర్వహించారు. పోట్లమర్రి, గంటాపురం, రాఘవంపల్లి, మాల్యవంతం, వెంకటగారిపల్లి, గుమ్మల్లకుంట, అప్పరాచెరువు, ఉప్పర్లపల్లి, నల్లబోయనపల్లి, కాటమకుంట, బత్తలపల్లి, రామాపురం, ఓబుళాపురం, సంగాల, వరదాపురం, జలాలపురం, గరిశలపల్లి, జ్వాలాపురం, తంబాపురంలో నాగుల చవితి వేడుకలు నిర్వహించారు. నాగుల కట్టలు, పుట్టలకు పూజలు చేపట్టారు.

ధర్మవరం రూరల్: గొట్లూరు గ్రామంలో నాగులచవితి పర్వదినం సందర్భంగా గురువారం మహిళలు నాగులకట్ట వద్ద ప్రత్యేక పూజలు చేశారు. సమీపంలో ఉన్న పుట్టకు దారం చుట్టి పసుపు కుంకుమ పెట్టి పూలతో అలంకరించి పుట్టలో పాలు పోశారు. ఉదయం నుంచి నాగులకట్ట వద్ద మహిళలు పూజలు చేయడానికి పెద్ద ఎత్తున చేరుకున్నారు. దీంతో అక్కడ పండుగ వాతావరణం నెలకొంది.

భూ సమస్యలు పరిష్కరించాలి

ధర్మవరం అర్బన్: దళిత, గిరిజన భూ సమస్యలను పరిష్కరించాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి తెలిపారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో గురువారం ఆర్డీఓ వెంకట శివరామిరెడ్డికి భూ బాధితులతో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మవరం రెవెన్యూ డివిజన్ పరిధిలో ఎస్సీ, ఎస్టీలకు చెందిన వివిధ రకాల భూ సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని కాళ్లరిగేలా తిరుగుతున్నా ప్రయోజనం లేదన్నారు. కార్యక్రమంలో సమతా సైనిక్ దళ్ జిల్లా అధ్యక్షుడు సుగుమంచి శ్రీనివాసులు, అంబేద్కర్ సేన పెద్దన్న, జేఏసీ రామకృష్ణ, భూబాధితులు తదితరులు పాల్గొన్నారు.

ముర్రుపాలతో బిడ్డకు ఆరోగ్యం

కనగానపల్లి: బిడ్డ పుట్టిన తర్వాత తొలిసారిగా తల్లి ఇచ్చే ముర్రుపాలు బిడ్డకు ఎంతో ఆరోగ్యకరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రశాంతి తెలిపారు. గురువారం మామిళ్లపల్లిలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ, ఆరోగ్య సిబ్బంది స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. తల్లిపాల విశిష్టతను వివరించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పౌష్టికాహార పదార్థాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో అంగనవాడీ వర్కర్లు, హెల్పర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.